క్లుప్తంగా

నిత్యాన్నదానం అభినందనీయం



నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : వెంకటాపురంలోని నీలకంఠేశ్వర స్వామిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నెలరోజుల పాటు ఉచితంగా అన్న సమారాధన నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్, సర్పంచ్ తాతాజీ, ఎంపీటీసీ వీరునాయుడు, వీఆర్వోల సంఘ రాష్ట్ర కోశాధికారి బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

మునగపాక: మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో ఉత్సవాలకు తరలివచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, గ్రీవెన్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, గౌరీ పరమేశ్వరులను దర్శించుకొన్నారు.

గంగాలమ్మ గుడి పునర్నిర్మాణ పనులు ప్రారంభం

మునగపాక : మూలపేటలో గంగాలమ్మ తల్లి ఆలయం పునర్నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గ్రామస్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ప్రస్తుతం ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెల్లయ్య నాయుడు భూమిపూజలో పాల్గొన్నారు.

వైభవ వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో శ్రీ వైభవ వేంకటేశ్వర వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్వామి అర్చన, విశేష పూలతో వార్షిక కళ్యాణ వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం నిత్యార్చన , అభిషేకం , గద్యలు, గరుడాహ్వానం, సోమవారం విష్వక్సేనపూజ, నిత్యహోమాలు తిరువీధి సేవ, ఎదురు సన్నాహ మహోత్సవం సాయంత్రం దివ్యలీలా కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు. మంగళవారం చక్రస్నానం భారీ అన్న సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

సమస్యలు ముందే గుర్తించండి



కె.వెంకటాపురంలో పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఆర్‌వో రామలక్ష్మి

కోటవురట్ల : ఎన్నికల నాటికి అన్ని పోలింగ్ కేంద్రాలు పటిష్టంగా ఉండాలని పాయకరావుపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రామలక్ష్మి సూచించారు. కె.వెంకటాపురంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆమె శనివారం పరిశీలించారు. రానున్న ఎన్నికల నిర్వహణకు ఏ సమస్య లేకుండా చూడాలని తహసీల్దారు జానకమ్మకు సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ముందుగా గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గాయత్రీ మహాయజ్ఞం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ప్రపంచ శాంతి, ప్రాణికోటి క్షేమాన్ని కాంక్షిస్తూ ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం 24 కుండీల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించారు. హరిద్వార్ శాంతికుంజ్ గాయత్రీ తీర్థం పండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య మహిళలు, పలువురు దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు.

రెల్లిలకు ప్రాధాన్యం కల్పించాలి

నక్కపల్లి : రాష్ట్రంలో ఉన్న రెల్లిలకు రాజ్యాధికారంలోచోటు కల్పించాలని రెల్లిహక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు యర్రంశెట్టి పాపారావు కోరారు. శనివారం నక్కపల్లిలో బంగారి రాజు అధ్యక్షతన రెల్లి సామాజికవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లిలకు విద్య, ఉపాధి, సంక్షేమ అభివృద్ధిలో ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



ఇది కదా అభివృద్ధి

ఆనంద లోగిళ్లు

- సొంతింటి కల నెరవేరిన వేళ..
- జగనన్నకు లబ్ధిదారుల జేజేలు
- స్థలాలు, ఇళ్లు మంజూరు
- ఊళ్లను తలపిస్తున్న జగనన్న లేఅవుట్లు

సొంతింటి కల నెరవేరింది



నా పేరు కె. తులసి. మాది కృష్ణంపాలెం గ్రామం. మా ఆయన కారు డ్రైవర్. సొంతిల్లు నిర్మించుకోవాలని కొన్నేళ్లుగా అనుకునేవాళ్లం. పరిశ్రమలకు చేరువలో ఉండడంతో ఇళ్లకు డిమాండ్ ఉంది. నెలకు రూ.4వేలు చెల్లించి అద్దె ఇంట్లో వుండేవారం. జగనన్న విలువైన స్థలం ఇచ్చి, ఇల్లు మంజూరు చేయడంతో ఆనందంగా ఉంది. సొంతంగా ఇల్లు నిర్మించుకున్నామన్న తృప్తి కలిగింది.

అద్దె ఇంటి బాధ తప్పింది



నా పేరు కె.నాగమణి. మాది కృష్ణంపాలెం. మేము చికెన్ దుకాణం నడుపుకొంటూ జీవనం సాగిస్తాం. సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడేవారం. నెలకు రూ. 5వేలు చెల్లించి అద్దె ఇంటిలో వుండేవరం. సంపాదనలో ఇంటి అద్దెకు ఎక్కువ మొత్తం పోతుండడంతో బాధగా వుండేది. ఇప్పుడు ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేయడంతో సొంతింటి యోగం కలిగింది.



పంచదార్ల లేఅవుట్‌లో ఇళ్లు



ఆకర్షణీయంగా నిర్మించిన ఇల్లు

రాంబిల్లి : దశాబ్దాల కల.. నెరవేరిన వేళ.. లబ్ధిదారుల ఆనంద హేల... స్థలాలు ఉచితంగా ఇచ్చి ఇళ్లు మంజూరు చేసిన జగనన్నకు లబ్ధిదారులు జేజేలు పలుకుతున్నారు. సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నకు నీరాజనాలు పడుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా స్థలాలు మంజూరు చేశారు. లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేశారు. ఆయా లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకొని సొంతింటి కలను నిజం చేసుకొని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇళ్ల మంజూరు గగనమే..

టీడీపీ హయాంలో ఇళ్ల మంజూరు గగనంగా ఉండేది. గ్రామానికి అరకొరగా మంజూరయ్యేవి. ఆయా పార్టీ అనుచరులకే దక్కేవి. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ఇళ్లు, స్థలాలు మంజూరు చేశారు. సుదీర్ఘకాలంగా ఇళ్లు లేక ఉమ్మడి కుటుంబంలో ఇరుకుమయంగా గడిపిన వారు కొందరైతే, అరకొర సంపాదనతో అద్దె ఇళ్లలో గడుపుతూ ఆర్థికంగా ఇబ్బంది పడేవారు మరికొందరు. ఈ సమస్యలకు సీఎం జగనన్న చెక్ పెడుతూ పేదల సొంతింటి కలను నిజం చేశారు.

ఖరీదైన స్థలాలు

రాంబిల్లి మండలంలో స్థలాలకు ఎంతో గిరాకీ ఏర్పడింది. సెజ్, నేవల్‌బేస్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో స్థలాలకు ఎంతో డిమాండ్ ఏర్పడింది. సెంటు రూ 2 లక్షలు నుంచి రూ. 4 లక్షలు వరకు పలుకుతోంది. దీంతో స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకోలేని పేదలు ఇప్పటివరకు ఇబ్బందులు పడ్డారు. అయితే ఉచితంగా ప్రభుత్వం స్థలాలు అందజేయడమేగాక ఇళ్లను కూడా మంజూరు చేయడంతో లబ్ధిదారులకు గృహ యోగం దక్కింది.



కృష్ణంపాలెం జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు



కొత్తూరు లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు

రాంబిల్లి మండలంలో జగనన్న లేఅవుట్లు, ఇళ్ల వివరాలు

జగనన్న లేఅవుట్లలో మంజూరైన ఇళ్లు	808
సొంత స్థలాల్లో మంజూరైన ఇళ్లు	411
మొత్తం ఇళ్లు	1219
ఇప్పటికే పూర్తయిన ఇళ్లు	409
వివిధ దశల్లో ఉన్న ఇళ్లు	479

జగనన్నకాలనీల్లో మౌలిక వసతులు



జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశాం. మండలంలో 17 సచివాలయాల పరిధిలో 808 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వడం జరిగింది. ఈ కాలనీల్లో ఇప్పటికే పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాలు చేసి నివసిస్తున్నారు. త్వరితగతిన మిగిలిన ఇళ్లు పూర్తి చేసుకోవాలని ప్రతీవారం కాలనీలకు వెళ్లి లబ్ధిదారుల్లో చైతన్యం చేస్తున్నాం.

– కె.ఎస్. కొండలరావు, ఎంపీడీవో, రాంబిల్లి మండలం

సీఎం పుట్టినరోజు వేడుకలకు ఘన ఏర్పాట్లు



విలేకర్లతో మాట్లాడుతున్న గూటూరు శ్రీనివాసరావు

పాయకరావుపేట : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గూటూరు శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో గల పంచాయతీ రాజ్ అతిథి గృహంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి శనివారం తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, బాల్ టోర్నమెంట్ టెన్నిస్ ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆటల పోటీలు నిర్వహించి, విజేతలైన వారికి 30 వేలు, 25 వేలు, 20 వేలు, 15 వేలు రూపాయలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా సీఎం జన్మదినం నాడు రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులతో ఆ రోజున భారీ జన్మదిన కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంచడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా డిసెంబర్ 21న జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పట్టణంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, మండల కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, నాయకులు తోట జమీలు, కేశనకుర్తి సత్తిబాబు, పల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

'కార్యదర్శిపై చర్యలేవీ...'



ఉన్నతాధికారుల నివేదికను చూపిస్తున్న దోసూరు సర్పంచ్ భర్త రామకృష్ణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు జిల్లా అధికారుల విచారణలో నిజం అని తేలినప్పటికీ ఇంకా పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయకుండా డిప్యూటేషన్‌పై సొంత మండలానికి పంపడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొర్ర్రపోలు చిన్నారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దోసూరు పంచాయతీ సర్పంచ్‌ను మోసం చేసిన కార్యదర్శి చెల్లించాల్సిన జీతాన్ని, చేసిన పనులకు సంబంధించిన సొమ్మును కార్యదర్శి సోదరుని ఖాతాలోకి మళ్లించినట్టు ఉన్నతాధికారులు గుర్తించి,రికవరీ చేయాలని ఆదేశించినా ఇంకా ఆమెను కాపాడే ప్రయత్నం ఎవరు చేస్తున్నారు అని ప్రశ్నించారు. దీనిపై వచ్చే సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దోసూరు సర్పంచ్ భర్త నర్మాల రామకృష్ణ మాట్లాడుతూ తన భార్యకు ఇవ్వాల్సిన జీతం ఇప్పించాలని, చేసిన పనులకు సంబంధించిన బిల్లుల సొమ్మును ఇవ్వాలని కోరారు. ఆరోపణలు ఉన్న కార్యదర్శిని మళ్లీ అచ్యుతాపురం మండలంలో కొనసాగేలా కొందరు పన్నాగాలు పన్నుతున్నారని, అదే జరిగితే కోర్టుని ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బాబ్జి, ఆవ సోమవరం ఎంపీటీసీ బాబూరావు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజలకు మేలు



ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మధ్యాహ్నం నాగులాపల్లి–2 సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లేను ఆయన ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని గుర్తించి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం కల్పించాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ జామి చినమ్మలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ గణేష్, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పార్టీ నేతలు సూరప్పారావు, సత్యనారాయణ, వెంకటప్పారావు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు. గ్రామ కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

నేడు బండిమాంబ జాతరకు భారీ ఏర్పాట్లు



ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

యలమంచిలి : ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఏటికొప్పాక గ్రామంలో వరహానది ఒడ్డున వెలసియున్న బండిమాంబ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ఏటికొప్పాక గ్రామ ప్రజల ఆరాధ్య దేవతగా పేరుగాంచిన శ్రీ బండిమాంబ అమ్మవారి జాతరను ఏటా కార్తీకమాసం మూడో వారంలో నిర్వహిస్తారు. జాతర మహోత్సవాన్ని తిలకించడానికి శ్రీకాకుళం, విజయనగరం , తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ సందర్భంగా బండిమాంబ ఆలయాన్ని వివిధ రంగులు, బంతిపూలు వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా అలంకరించారు. గ్రామంలో భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. సీఐ షేక్ గఫూర్, యలమంచిలి రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు, పట్టణ ఎస్‌ఐ కె.పాపినాయుడు, ట్రాఫిక్ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగులాపల్లి పీఏసీఎస్‌లో ఒడిశా బృందం



నాగులాపల్లి పీఏసీఎస్‌ను సందర్శించిన ఒడిశా రాష్ట్ర సహకార సంఘాల అధ్యయన బృందం

మునగపాక : నాగులాపల్లి పీఏసీఎస్‌ను శనివారం ఒడిశా రాష్ట్ర సహకార శాఖకు చెందిన 30 మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఆడిటర్లు సందర్శించారు. డీసీఎంఏ కోర్సులో భాగంగా ఇక్కడి పీఏసీఎస్‌ను అధ్యయనం చేసేందుకు వచ్చిన వారందరికీ సంఘ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు, సీఈవో మళ్ల స్వామి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపల్ మమతా సాహూ సంఘ ఆర్థిక పరిస్థితులు, సంఘం ద్వారా అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. తమ రాష్ట్ర సహకార సంఘాల కన్నా ఏపీలోని సంఘాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని సంఘ అధ్యయన బృందంలోని సభ్యులు అన్నారు. ఇక్కడకు వచ్చిన తరువాత పలు కొత్త విషయాలు తెలుసుకోగలిగామన్నారు. సంఘ లావాదేవీలకు సంబంధించి అధ్యక్ష, కార్యదర్శులు వారికి వివరించారు. సంఘ పాలకవర్గ సభ్యుడు నరాలశెట్టి బాబూరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం



లాలంకోడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. లాలంకోడూరులో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ కోట్లాది రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి చేసిన జగనన్నకు అండగా నిలవాలన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ జెండాతో పాటు సంక్షేమం, అభివృద్ధి నిధుల వివరాల బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైస్ ఎంపీపీ నర్సింగరావు, సర్పంచ్ రమణమూర్తి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శోభాయాత్ర



పాయకరావుపేట : హిందూ ధార్మిక మహా సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా శనివారం పాయకరావుపేటలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు, తప్పెటగుళ్ల, తోడపెద్దు బృందాలు, డప్పుకళాకారులు, భజన బృందాలు పాల్గొన్నారు.

స్త్రీల రక్షణ కోసం అనేక చట్టాలు

యలమంచిలి : సమాజంలో స్త్రీల రక్షణ కోసం అనేక చట్టాలు అమలులో ఉన్నాయని ప్రముఖ మహిళా న్యాయవాది కె.రోజా అన్నారు. స్థానిక శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళల హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సును మహిళా సాధికారిక సంస్థ నిర్వాహకురాలు లక్ష్మీనరసమ్మతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానంగా విద్య, ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని ఈ క్రమంలో స్త్రీలకు వారు రాణించే రంగాల్లో ఎదుయ్యే సంఘటనలు అవమానాలు,లైంగికంగా వేధింపులు అధిగమించేలా ప్రభుత్వం ఇండియన్ పీనల్ కోడ్‌లో మహిళల రక్షణ గురించి పలు చట్టాలు అమలు పరిచిందని తెలిపారు. మహిళలు వృత్తి పరంగా వారికి ఎదురయ్యే సమస్యలు ఏవిధంగా అధిగమించాలో వివరిస్తూ న్యాయరమైన సలహాలు,మహిళల హక్కులపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, అధ్యాపకులు విజయలక్ష్మి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్

నక్కపల్లి: ఓటర్ల నమోదుకు ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని, బీఎల్‌వోలు ఆదివారం అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు ఆదేశించారు. శనివారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే స్పెషల్ డ్రైవ్ గురించి గ్రామాల్లో దండోరా వేసి ప్రచారం నిర్వహించాలన్నారు.

ఎస్.రాయవరం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , మండల స్పెషల్ ఆఫీసర్ మహేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శని,ఆదివారాలు గ్రామాల్లో బీఎల్‌వోలు ప్రత్యేక డ్రైవ్ విధానంలో ఓట్లు నమోదు చేయడం జరుగుతోందన్నారు.

జనవరి 26న శ్రీనివాస కల్యాణం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మండల పోలీస్ గ్రౌండ్‌లో వచ్చే నెల 26న శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన బుజ్జి తెలిపారు. ఈ మేరకు సదరు కార్యక్రమం పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జీనజీయర్ స్వామి విచ్చేయనున్నారని నిర్వాహకులు, విశాఖ తరంగిని కో–ఆర్డినేటర్ సరిసా శ్రీను తెలిపారు. 150 గ్రామాలకు చెందిన భక్తులు ఈ పుణ్య కార్యక్రమంలో పాల్గొననున్నారని శ్రీను పేర్కొన్నారు.

రేపు నాగులాపల్లిలో శూలాల మహోత్సవం

మునగపాక: నాగులాపల్లిలో ఈ నెల 4వ తేదీన శూలాల మహోత్సవానికి ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో బుగ్గ, నాలుక శూలాలు ధరించే భక్తుల సౌకర్యార్థం చర్యలు తీసుకుంటున్నారు. ఆ రోజు రాత్రి పలు భారీ శూలాల ప్రదర్శన జరగనుంది.

ఎం.జగన్నాథపురంలో వై ఏపీ నీడ్స్ జగన్



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

అచ్యుతాపురం (అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, మళ్లీ ఆయనే సీఎంగా కొనసాగితే కలిగే మేలు గురించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు.

వలంటీర్ సేవా నిరతి



మునగపాక : వాడ్రాపల్లికి చెందిన కాండ్రేగుల అప్పారావు గుండె, కిడ్నీ వ్యాధితో సతమతమవుతూ గాజువాకలో బంధువుల ఇంటివద్ద ఉంటున్నారు. దీంతో డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛన్ రూ.2750 నగదును వలంటీర్ రజని శనివారం అప్పారావు ఉంటున్న ఇంటికి వెళ్లి అందజేశారు.

5న కుల గణన సమావేశం

యలమంచిలి : ఈ నెల 5వ తేదీన కులగణనపై యలమంచిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.